


గోశాలలకు పశువుల దాన అందజేస్తున్న మహేష్ అగర్వాల్

గోవధను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం

● మహేష్ అగర్వాల్

బర్కత్‌పుర, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గోవధను అరికట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ ఆరోపించారు. ఒకవర్గం ఓట్ల కోసం గోవధను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆదివారం కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ఆధ్వర్యంలో మహానంది గోశాల, శ్రీబాలజీ గోశాలలకు పశువుల కోసం మినరల్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణాను నిరోధించడానికి ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని, పశువుల సంతలను మూసివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రేమ్‌చంద్, మునోద్, వినీత్, అన్మోల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

అంబర్‌పేట ట్రాఫిక్ పోలీసుల పనితీరు భేష్

అంబర్‌పేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్‌ను నియంత్రించడానికి గత సంవత్సరం అంబర్‌పేటలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. అంబర్‌పేటలో ఫ్లైఓవర్ నిర్మాణంతో చౌరస్తాల వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా ట్రాఫిక్ పోలీసులు సమర్థవంతంగా పనిచేస్తున్నారు. సంవత్సర కాలంలో రోడ్లపై నిలిపిన వాహనాలపై 2,133 కేసులు, రోడ్ల తనిఖీలలో 23,621 కేసులు, 1875 డంకెన్ డ్రైవ్ కేసులు, అక్రమంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించే వారిపై 3243 కేసులు నమోదు చేశారు. అంబర్‌పేటలో ఫ్లైఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్‌ను శ్రీరమణ చౌరస్తా నుంచి ఆలీకేఫ్ మీదుగా గోల్నాక కూరగాయల మార్కెట్ వరకు వాహనాలను దారిమళ్లించారు. ఆలీకేఫ్ చౌరస్తా, అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం, శ్రీరమణ చౌరస్తా, గోల్నాక చౌరస్తాల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు.

నిబంధనలు పాటించాలి



అంబర్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారులు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిబంధనలు పాటించాలి. చౌరస్తాల వద్ద వాహనాలను వేగంగా నడపకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలి. రోడ్లపై వచ్చే వారిని దృష్టిలో ఉంచుకుని వాహనాలను జాగ్రత్తగా నడపాలి, నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. - లెనిన్‌బాబు, ట్రాఫిక్ సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న పైళ్ల ఆశయ్య

రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

రాంనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లక్షలాది మంది రజకులు తమ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం హైదరాబాద్ శాఖ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రజకుల సామాజిక భద్రతకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి రాజు నరేష్, నాయకులు బాలకృష్ణ, ఉపేందర్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉచిత ఆయుర్వేదిక్ శిబిరం

బర్కత్‌పుర, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): న్యూలైఫ్ ఆయుర్వేదిక్ ఆయిల్ థెరపీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4వ తేదీలలో బర్కత్‌పురలో ఉచిత ఆయుర్వేదిక్ శిబిరం నిర్వహిస్తున్నట్లు సెంటర్ ఎండీ ప్రముఖ ఆయిల్ థెరపిస్ట్ శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. ఆదివారం బర్కత్‌పుర లింగంపల్లి చౌరస్తాలోని ఆయుర్వేదిక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరం బర్కత్‌పుర లింగంపల్లి చౌరస్తా వద్ద గల శ్రీరాఘవేంద్ర స్వామి మఠం ఎదురుగా ఉన్న ఆయుర్వేదిక్ సెంటర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందన్నారు. వివరాలకు 8247553984, 7993856327 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని శ్రీనివాస్‌గుప్తా కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో 35 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్ సంతోష్‌గిరి ప్రాంతానికి చెందిన షేక్ షరీఫ్‌కు బోరబండ నివాసి తబసుమ్‌తో తొమ్మిదేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. షరీఫ్ మద్యం తాగి భార్య, పిల్లలను తరచూ కొడుతున్నాడు. దీంతో భార్య ఇటీవల పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. షరీఫ్ శనివారం రాత్రి భార్యకు వాట్సాప్‌లో ఇంటికి రావాలని, రాకపోతే ఆత్మహత్య చేసుకుంటానని, రేపు నేను కనిపించనని మెసేజ్ పెట్టాడు. అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తల్లి షమీమ్ అతడి గదికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ ఉండడంతో చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించారు. షమీమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించానన్నాడు.. మోసం చేసి ముఖం చాటేశాడు

యూసుఫ్‌గూడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రేమించానని ఓ యువతిని మోసం చేసి ముఖం చాటేశాడో యువకుడు. పోలీసుల కథనం ప్రకారం.. జవహర్‌నగర్‌లో నివసిస్తున్న రాజ్‌కుమార్ మూడేళ్లుగా మీ-సేవలో పనిచేస్తున్నాడు. ఆ సమయంలో మీసేవకు వచ్చిన ఓ యువతితో అతడికి పరిచయం ఏర్పడింది. ప్రేమించానని చెప్పడంతో ఆమె అంగీకరించింది. ఈ విషయం ఇరువురి ఇళ్లలో తెలిసినా ఎవరూ వ్యతిరేకించలేదు. రాజ్‌కుమార్ ఉద్యోగం పోయింది. పెళ్లి చేసుకుందామని యువతి అడగగా.. ఉద్యోగం వచ్చిన తరువాత అంటూ కాలయాపన చేస్తూ తప్పించుకు తిరుగుతున్నాడు. మోసపోయానని గ్రహించిన యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ కోసం కత్తితో దాడి

యూసుఫ్‌గూడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఫోన్ కోసం ఇద్దరు వ్యక్తులు ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. వెంగళరావునగర్‌లో నలందా కళాశాలలో పి. జాషువా కుమార్ పనిచేస్తున్నాడు. ఆదివారం కాలేజీ ఎదుట కూర్చొని ఉండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి ఫోన్ కావాలని అడిగారు. ఫోన్ ఇవ్వగానే వారు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని అడ్డుకునేందుకు జాషువా ప్రయత్నించగా కత్తితో దాడి చేశారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు వచ్చి ఆగంతుకులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బీజేపీ నగర కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కె. లక్ష్మణ్



నల్లకుంటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, కాంగ్రెస్ నాయకులు



నింబోలిఅడ్డలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, తదితరులు



బర్కత్‌పుర చౌరస్తాలో జెండాను ఆవిష్కరిస్తున్న జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు

ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, తెలంగాణ ప్రజానీకం పాలొన్నారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ ఎందరో త్యాగాల కారణంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు.
-జోన్ బృందం ముషీరాబాద్, అంబర్‌పేట



అంబర్‌పేట పటేల్‌నగర్ చౌరస్తాలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు



పటేల్‌నగర్ చౌరస్తాలో కేక్‌కట్ చేస్తున్న మాజీ కార్పొరేటర్ పులి జగన్, కాంగ్రెస్ పార్టీ నేతలు



ముషీరాబాద్ రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో బాలికలకు అన్నదానం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



ప్రభుత్వ పాఠశాల వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న ముషీరాబాద్ డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి



భోలక్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జెండాను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంక



తెలంగాణ భవన్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు



బాగ్‌అంబర్‌పేట పారిశుధ్య కార్మికులకు స్వీట్స్ తినిపిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, తదితరులు



నగర గ్రంథాలయ సంస్థలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న పళని కదిరవన్



గాంధీనగర్‌డివిజన్ అరుంధతినగర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న నర్సయ్య, తదితరులు



గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు సుధేష్, తదితరులు



జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం పాట రచించిన కవి అందెశ్రీని ఆదివారం అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్ కలిసి అభినందించారు.



బతుకమ్మకుంటలో జాతీయ పతాకం ఎగురవేస్తున్న మాజీ కార్పొరేటర్ పుల్ల నారాయణస్వామి



అంబర్‌పేటలోని తన ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ వి. హనుమంతరావు



తెలంగాణ అమరవీరులకు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నగర నాయకులు సిరిగిరి శ్యామ్, సత్యనారాయణ

ఏడాది పూర్తి చేసుకున్న మహిళా పోలీస్ స్టేషన్

అంబర్‌పేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గత సంవత్సరం జూన్ 2వ తేదీన అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన ఈస్ట్‌జోన్ మహిళా పోలీస్ స్టేషన్, అంబర్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏడాది పూర్తి చేసుకున్నాయి. ఆయా పీఎస్‌ల పరిధిలో వచ్చే కేసులను సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాయి. అంబర్‌పేట ఈస్ట్‌జోన్ మహిళా పోలీస్ స్టేషన్ కింద కాచిగూడ, అంబర్‌పేట, లాలాగూడ, వారసీగూడ, చిలకలగూడ, ఉస్మానియా యూనివర్సిటీ, నల్లకుంట, సుల్తాన్‌బజార్, అఫ్జల్‌గంజ్, నారాయణగూడ పీఎస్‌లు ఉన్నాయి. సంవత్సర కాలంలో పీఎస్‌లో వచ్చిన కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. బేగంపేట మహిళా పీఎస్ నుంచి 16 కేసులు, సీసీఎస్ ఉమెన్స్ పీఎస్ నుంచి 94 కేసులు ఇక్కడికి బదిలీ అయ్యాయి. 2023లో 704 ఫిర్యాదులు రాగా వాటిలో 279 కేసుల వారు రాజీపడ్డారు. మిగత కేసులను కూడా పోలీసులు పరిష్కరించారు. 2024లో 551 ఫిర్యాదులకు గానూ 474 కేసులు పరిష్కారమయ్యాయి. 81 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడానికి కేసు పరిస్థితిని బట్టి భరోసా కేంద్రాలకు తరలించి పరిష్కరిస్తున్నారు. మహిళా పోలీస్ స్టేషన్‌లో ఒక సీఐ, ముగ్గురు ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, ఆరు మంది హెడ్‌కానిస్టేబుల్స్, 20 మంది కానిస్టేబుల్స్, నలుగురు మహిళా హోం గార్డులు ఉన్నారు. మహిళా పీఎస్‌కు ఇంతవరకు ముగ్గురు సీఐలు బాధ్యతలు వహించారు. ఈస్ట్‌జోన్ మహిళా పోలీస్ స్టేషన్ మొదటి సీఐగా శ్రేయ పనిచేయగా ఆమె తర్వాత మంజుల, ప్రస్తుతం మహేష్ గౌడ్ సీఐగా పనిచేస్తున్నారు.



ఈస్ట్‌జోన్ మహిళా పోలీస్ స్టేషన్

వెంటనే కేసులను పరిష్కరిస్తున్నాం



మహిళా పోలీస్ స్టేషన్‌కు వచ్చే కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ఎక్కువగా కుటుంబ తగాదాలు, భార్యాభర్తల ఫిర్యాదులు వస్తున్నాయి. ఫిర్యాదు దారులను భరోసా కేంద్రానికి పంపించి వారికి కౌన్సిలింగ్ ఇప్పించి వారిని రాజీ చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.
- మహేష్‌గౌడ్, సీఐ, ఈస్ట్‌జోన్ మహిళా పోలీస్ స్టేషన్

అనుమానాస్పద స్థితిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

బర్కత్‌పుర జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఛత్రినాక ప్రాంతానికి చెందిన ఎం. రాహుల్(21) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఛత్రినాకలోనే నివాసం ఉంటున్న మే 31న ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాహుల్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్నేహితులు బంధువుల ఇళ్లలో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు ఛత్రినాక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. రాహుల్ కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓయో హోటల్లో జూన్-1న రూం అద్దెకు తీసుకున్నాడు. హోటల్ రూమ్‌లో అదే రోజు రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నాడు. హోటల్ సిబ్బంది కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాహుల్ ఆత్మహత్య చేసుకున్నాడా..? లేక ఎవరైనా చంపి ఉరి వేశారా..? మరేదైనా కారణాలు ఉన్నాయా..? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఛత్రినాక నుంచి రాహుల్ కాచిగూడకు ఎందుకు వచ్చాడు. రూం ఎందుకు తీసుకున్నాడు.? హోటల్లోనే చనిపోవాల్సిన అవసరం ఏంటి.? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

8న మల్కాజిగిరి కోర్టులో జాతీయ లోక్‌అదాలత్

ఏఎస్‌రావునగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఢిల్లీ, తెలంగాణ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మల్కాజిగిరి ఆధ్వర్యంలో ఈ నెల 8న కుషాయిగూడలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్‌రావు, సెక్రటరీ కిరణ్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, వాహన ప్రమాద, బ్యాంకు రికవరి, చెక్‌బౌన్స్, భూ వివాదాలకు సంబంధించిన, రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవచ్చని వారు పేర్కొన్నారు.

కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమన్యాయం, సత్వరన్యాయం పొంది సమయాన్ని ఆదా చేసుకోవాలని వారు సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట దేవమ్మ బస్తీలో నివాసం ఉండే శ్రీనివాస్(50)ఈసీఎల్‌లోని ఓ బ్యాంక్‌లో ఉద్యోగం చేసి మానేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. అప్పుల బాధ ఎక్కువ అవ్వడంతో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లో ఉరేసుకొన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ రేస్‌లు నిర్వహిస్తున్న వారిపై కేసులు

రాయదుర్గం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్‌కమిషనర్,మాదాపూర్ డీసీపీ ఆదేశాల మేరకు గచ్చిబౌలిలో కోహినూర్ హోటల్ రోడ్డులో బైక్‌రేస్‌లో నిర్వహిస్తున్న వారిపై రాయదుర్గం పోలీసులు శనివారం రాత్రి ప్రత్యేక దాడులు నిర్వహించారు. సుమారు 50 స్పోర్ట్స్ బైక్‌లు అదుపులోకి తీసుకుని సీజ్ చేశారు. బైక్ రైడర్స్‌పై కేసులు నమోదు చేశారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న, ఎస్సైలు 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించేందుకే వేసవి శిక్షణా శిబిరాలు

బోయినపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించేందుకే వేసవి శిక్షణా శిబిరాలు ఉపయోగపడతాయని క్రీడా శిక్షణ శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని అంతర్జాతీయ వెటరన్ క్రీడాకారుడు, జాతీయ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, హైదరాబాద్ సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి పేర్కొన్నారు. కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జంపనప్రతాప్ సహకారంతో వివిధ క్రీడలలో కంటోన్మెంట్ ప్లేగ్రౌండ్ బోయినపల్లిలో 30 రోజులపాటు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణా శిబిరం ఆదివారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్‌తో కలిసి అంతర్జాతీయ వెటరన్ క్రీడా కారుడు జాతీయ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, హైదరాబాద్ సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో శిక్షణ పొందిన క్రీడాకారులను అభినందించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలు, టీ షర్టులను అందజేశారు.



కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న జైసింహ, సంజీవ్‌కుమార్

తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల పాత్ర కీలకం

చిక్కడపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల పాత్ర కీలకమని బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నేత ముఠా జైసింహ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి అశోక్‌నగర్ క్రాస్‌రోడ్‌లోని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ముదారపు రాకేష్‌కుమార్, నేతలు బోనం ఊర్మిళ, శ్రీకాంత్, టి.సంజీవ్‌కుమార్, ఎయిర్‌టెల్‌రాజు, పున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో ఈ సారి ఏ పార్టీకి ఆధిక్యం?



బర్కత్‌పుర/నల్లకుంట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాలు రేపు తేలనున్నాయి. మే 13 న ఎన్నికలు జరగగా ఈ నెల 4వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా రెండోసారి బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి దానం నాగేందర్, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పద్మారావుగౌడ్ పోటీ చేస్తున్న విషయం విదితమే. అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలు ఈ సారి ఏ పార్టీకి మెజారిటీ అందిస్తారోననేది ప్రధానంగా చర్చనీయాంశంగా మారింది. ప్రధాని మోదీ వేవ్‌లో అన్ని వర్గాల ప్రజలు బీజేపీని ఆదరించారని ఎగ్జిట్ ఫలితాలు కూడా తమకే అనుకూలంగా ఉన్నాయని ఆ పార్టీ నేతలు ధీమాలో ఉండగా మైనారిటీల అండతో గెలుస్తున్నామని కాంగ్రెస్ నేతలు, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వ్యతిరేక ఓటుతో విజయం సాధిస్తామన బీఆర్‌ఎస్ నేతలు ధీమాలో ఉన్నారు. ప్రతి ఎన్నికల్లో విలక్షణమైన తీర్పునిచ్చే అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలు ఎంపీ ఎన్నికల్లో ఏ పార్టీకి అండగా నిలుస్తారనేది మంగళవారం తేలనున్నది.



చెస్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలు

ఆల్ ఇండియా చెస్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

ఉప్పల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా మెగా ఓపెన్, అండర్ 15 చెస్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి బహుతులు అందజేశారు. వారస్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో గుజరాతీ సేవమండల్‌లో ఆదివారం ముగిసిన రెండు రోజుల జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో భరత్‌కుమార్‌రెడ్డి ఓపెన్ కేటగిరీలో, అండర్ 15 విభాగంలో తాళ్ళ నిశ్చల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. ఈ పోటీల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అండర్ 15 విభాగంలో 282, ఓపెన్ కేటగిరీలో 185 మంది పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు రూ. 2లక్షల నగదు బహుమతులు అందజేశారు.